

# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 04-04-2026 | సంపుటి - 27 | సంచిక -312 | రూ : 4 | పేజీలు: 8

## వస్త్రరంగంలో...
# అగ్రగామిగా ఎదుగుదాం

- ఆ నైపుణ్యం, సంకల్పం తెలంగాణకు ఉన్నాయి
- అటెక్స్‌కాన్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- గ్రీన్‌టెక్స్‌టైల్ హబ్‌లు నిర్మిస్తామని వెల్లడి
- పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ

2లో





# వేగంగా రైళ్ల అనుసంధానం

- మెరుగుపడనున్న సదుపాయాలు
- రద్దీ, సమయమూ తగ్గే అవకాశం
- దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు

2లో

## ఇంట్లో ఈగల మోత..
# కేరళంలో పల్లకీల మోత

- ఇక్కడ ఏం చేశారని అక్కడికెళ్లి గొప్పలు చెబుతున్నారు?
- గిరిజనులకు కాంగ్రెస్ చేసింది సున్నా.. వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించింది కేసీఆర్ : సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



2లో

# అమెరికాకు ఎదురుదెబ్బ

- ఆ దేశ యుద్ధ విమానాన్ని కూల్చేసిన ఇరాన్
- ఇద్దరు పైలట్ల కోసం అన్వేషిస్తున్నామని వెల్లడి
- ఒకరిని రక్షించినట్లు అమెరికా అధికార వర్గాల ప్రకటన
- ఇరాన్‌పై కొనసాగిన బాంబుల వర్షం
- భారీ వంతెన ధ్వంసం.. 8 మంది మృత్యువాత
- కువైట్‌పై టెహ్రాన్ భీకర దాడులు
- అబుధాబీలో ఐదుగురు భారతీయులకు గాయాలు

2లో



## విఫల ప్రేమ నేరం కాదు..
# వాగ్దాన ఉల్లంఘనే



2లో

- ఆదిలోనే మోసపూరిత ఉద్దేశం ఉందన్న ఆధారాలు కావాలి
- తీర్పు వెలువరించిన హైకోర్టు



## సంజు శాంసన్ రియల్ ప్లేయర్
# పీఎం నరేంద్ర మోదీ

- టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సంజూ శాంసన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- కీలక నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ అత్యుత్తమ ఆటతీరు కనబరిచా డని కొనియాడిన ప్రధాని
- టోర్నీలో 321 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన సంజూ
- ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారతీయుడిగా కోహ్లీ రికార్డు బద్దలు

2లో

# యువ ఓటర్లే విజయ్ లక్ష్యం

- వారి కలలకు అనుగుణంగానే మ్యానిఫెస్టో రూపకల్పన
- ఉత్సాహంగా ప్రచారం ప్రారంభించిన అభ్యర్థులు

తమిళనాడు : డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు ప్రత్యామ్నాయం అంటూ వచ్చిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) యువ ఓటర్లే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తోంది. వారిని లక్ష్యంగా చేసుకునే టీవీకే అధినేత విజయ్ మ్యానిఫెస్టోను రూపొందించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ, గ్రామీణ యువతను తరువాయి 2లో





# క్వాంటమ్‌తో కొత్త కళ!

- డిసెంబరు నాటికి అత్యాధునిక కంప్యూటర్ ఏర్పాటు
- అమరావతిలో క్వాంటమ్-ఏఐ ఇన్నోవేషన్ సెంటర్
- పరిశ్రమల అవసరాల కోసం యూజ్ కేసులు

2లో

## వైకాపా 'నాశనం' చేయాలనుకుంటే..
# మనం 'శాసనం' చేశాం

- అమరావతికి చట్టబద్ధత ప్రజా విజయం
- ఓర్వలేకే జగన్ తిక్క తిక్క మాటలు
- ఎవరెంత ఏడ్చినా.. అమరావతి ఆగదు
- విలేకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో



# అమెరికాకు ఎదురుదెబ్బ

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ దేశానికి చెందిన అత్యాధునిక ఎఫ్15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసింది. ఆ సమయంలో విమానంలో ఇద్దరు పైలట్లు ఉండగా.. వారిద్దరూ బయటకు దూకేశారని టెహ్రాన్ తెలిపింది. వారి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని తమ దేశ ప్రజలను కోరింది. అయితే ఇద్దరు పైలట్లలో ఒకరిని సురక్షితంగా కాపాడామని, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు పేర్కొనడం గమనార్హం. గాలింపు చర్యల్లో పాల్గొంటున్న ఓ హెలికాప్టర్‌ను కూడా తాము కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. మరోవైపు పశ్చిమాసియా వ్యాప్తంగా పలు దేశాలపై ఇరాన్ శుక్రవారం దాడులు కొనసాగించింది. కువైట్‌లోని ఓ ప్రధాన చమురు శుద్ధి కర్మాగారంపై అది దాడి చేయడంతో మంటలు చెలరేగాయి. యూఏఈ రాజధాని అబుధాబీపైకి టెహ్రాన్ ప్రయోగించిన క్షిపణుల శకలాలు తగిలి ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగాయి. టెహ్రాన్‌ను కారజ్ నగరంతో అనుసంధానించేందుకు నిర్మిస్తున్న భారీ వంతెన ఈ దాడుల్లో దెబ్బతింది. పశ్చిమాసియాలో కెల్లా ఎత్తైన వంతెనగా దీనికి పేరుంది.

**ఇరాన్ భూభాగంలో ఇదే తొలిసారి**

నైరుతి ఇరాన్‌లోని పర్వత ప్రాంతంలో అమెరికాకు చెందిన ఎఫ్35 యుద్ధవిమానాన్ని తాము కూల్చివేసినట్లు ఇరాన్ తొలుత పేర్కొంది. ఈ ఘటనలో విమానం నుంచి బయటకు దూకేసిన శత్రుదేశ పైలట్ల కోసం చహర్‌మహల్, బఖ్తియారీ ప్రావిన్సుల్లో వెతకాలని.. వారి జాడ తెలియజేసినవారికి భారీ నజరానా అందజేస్తామని ప్రకటించింది. శకలాలను ట్రక్కులో తరలిస్తున్న దృశ్యాలను ప్రభుత్వ అనుబంధ వార్తా ఛానల్ ఒకటి ప్రసారం చేసింది. అయితే ఇరాన్‌లో కూలిపోయింది ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ యుద్ధవిమానమని అమెరికా వర్గాలు వెల్లడించాయి. అందులోని ఇద్దరు పైలట్లలో ఒకరిని రక్షించామని, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోందని అమెరికా, ఇజ్రాయెల్ అధికారవర్గాలు తెలిపాయి. ఈ పరిణామం సంబంధిత వివరాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు తెలియజేసినట్లు శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు. ఇరాన్ భూభాగంలో అమెరికా యుద్ధవిమానాన్ని కోల్పోవడం ఇదే తొలిసారి.

**టెహ్రాన్ భీకర దాడులు**

కువైట్‌పై ఇరాన్ శుక్రవారం భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో ఓ నిర్లవణీకరణ కర్మాగారం ధ్వంసమైంది. కువైట్‌లోని మీనా అల్‌అహ్మదీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్లు విరుచుకుపడటంతో మంటలు చెలరేగాయి. ప్రపంచంలోని అతిపెద్ద రిఫైనరీల్లో మీనా అల్ అహ్మదీ ఒకటి. అబుధాబీపైకి దూసుకొచ్చిన క్షిపణులను యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. అయితే వాటి శకలాలు తగిలి ఐదుగురు భారతీయులు, ఏడుగురు నేపాలీలు గాయపడ్డారు. ఇరాన్ ప్రయోగించిన 18 బాలిస్టిక్ క్షిపణులు, 4 క్రూజ్ క్షిపణులు, 47 డ్రోన్లను శుక్రవారం కూల్చివేసినట్లు యూఏఈ తెలిపింది. ఇరాన్ నుంచి ఓ క్షిపణిని అడ్డుకోవడంతో యూఏఈలోని ఓ గ్యాస్ క్షేత్రంపై శకలాలు భారీగా పడ్డాయి. ఆ క్షేత్రాన్ని మూసివేశారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో సైరన్ల మోత వినిపించింది. ఇరాన్ ప్రయోగించిన పలు డ్రోన్లను ఆ దేశాల బలగాలు కూల్చివేశాయి.

- **ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది.**

సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై మార్చి 1న ఇరాన్ చేసిన దాడిలో అమెరికాకు చెందిన అత్యంత ఖరీదైన ఏఎన్/టీపీవై2 రాడార్ ధ్వంసమైనట్లు తాజాగా శాటిలైట్ చిత్రాలు ధ్రువీకరించాయి. దుబాయ్‌లోని ఒరాకిల్, బహ్రెయిన్‌లోని అమెజాన్ సంస్థల డేటా సెంటర్లపై ఐఆర్‌జీసీ గురువారం దాడులు చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. ఈ వార్తలను యూఏఈ అధికారులు ఖండించారు. హర్మూజ్ సమీపంలో గత నెల 11న దాడికి గురైన తమ నౌకలో మానవ అవశేషాలు కనిపించినట్లు థాయిలాండ్ శుక్రవారం వెల్లడించింది. నాటి దాడి తర్వాత ముగ్గురు సిబ్బంది అదృశ్యమైనట్లు గతంలో పేర్కొన్న సంగతి గమనార్హం. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. ఇస్ఫహాన్‌పైనా దాడులు చేశాయి. టెహ్రాన్‌ను కారజ్ నగరంతో అనుసంధానించేందుకు నిర్మిస్తున్న భారీ వంతెనపై జరిగిన దాడిలో 8 మంది మృత్యువాతపడ్డారు.

# విఫల ప్రేమ నేరం కాదు.. వాగ్దాన ఉల్లంఘనే

హైదరాబాద్: వివాహం చేసుకుంటానని, ప్రేమలో కొనసాగి విఫలమైతే అది మోసం కిందకు రాదని, నేరం కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. మోసం చేయాలన్న ఉద్దేశంతోనే వివాహం చేసుకుంటానని ప్రేమను ప్రారంభించినట్లు ఆధారాలుండాలని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి, చేసుకోలేదన్న కారణంగా ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసును కొట్టివేయాలంటూ... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాలకు చెందిన కె.సంతోష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.తుకారాంజీ ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఎలాంటి ఆధారాల్లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరారు. వ్యక్తిగత సంబంధాలు దెబ్బతింటే అవి నేరం పరిధిలోకి రావని గతంలో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. యువతి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... 2018లో ప్రేమకు ప్రతిపాదించగా నిరాకరించారని, అయితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఒప్పించాడన్నారు. ఐదేళ్లపాటు అనుబంధాన్ని కొనసాగించాక పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరిస్తూ పరిహారం చెల్లిస్తానన్నారని.. పెద్దలు మధ్యవర్తిత్వం చేయగా మొదట అంగీకరించి తిరస్కరించాడని, ఇది మోసమేనని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పును వెలువరిస్తూ.. పిటిషనర్ వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశారన్నదానిపై గతంలో హృదయరంజన్ ప్రసాద్‌వర్మ వర్సెస్ బిహార్, ప్రమోద్ సూర్యభాన్ పవార్ వర్సెస్ మహారాష్ట్ర తదితర కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు వెలువరించిందని, వీటి ప్రకారం ఆదిలో మోసపూరిత ఉద్దేశం లేనపుడు అది కేవలం వివాహం చేసుకుంటానన్న వాగ్దానం ఉల్లంఘన మాత్రమేనని పేర్కొన్నారు. వాగ్దానం ప్రారంభంలో మోసం చేయాలన్న దురుద్దేశం లేకపోతే దాన్ని మోసంగా పరిగణించలేమన్నారు. ప్రస్తుత కేసులో ఐదేళ్లపాటు ప్రేమలో కొనసాగారని, ఇది వాగ్దానంలో వైఫల్యమే తప్ప మోసం కాదని.. సుదీర్ఘ కాలం ప్రేమలో కొనసాగిన పిటిషనర్‌కు ప్రారంభంలో మోసపూరిత ఉద్దేశం ఉందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెప్పారు. పిటిషనర్‌పై కేసును కొనసాగించడం చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొన్నారు. హైకోర్టు విచక్షణాధికారాన్ని వినియోగించి పిటిషనర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# వస్త్రరంగంలో అగ్రగామిగా ఎదుగుదాం

హైదరాబాద్: రాష్ట్రాన్ని 2047 నాటికి దక్షిణాసియా జౌళి వస్త్ర రాజధానిగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రపంచానికి ఫ్యాషన్ దుస్తులను అందించే కేంద్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. వస్త్ర రంగంలో అగ్రగామిగా ఎదిగే నైపుణ్యం, సంకల్పం తెలంగాణకు ఉన్నాయన్నారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో శుక్రవారం జరిగిన ఆసియా జౌళి సదస్సు (అటెక్స్‌కాన్)2026ను ఆయన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అత్యుత్తమ విధానాలు, మానవ వనరులతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే జౌళి, పర్యావరణ వ్యవస్థను రాష్ట్రంలో నిర్మిస్తామని, గ్రీన్‌టెక్స్‌టైల్ హబ్‌లను ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. ఈ పురోగతిలో వస్త్ర పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని కోరారు. ''టీకాలు, ఔషధాల తయారీలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ ఇప్పుడు ఆపిల్ ఇయర్ పాడ్స్ తయారీ కేంద్రంగా మారింది. ముమ్మందు ప్రపంచానికి ఫ్యాషన్ దుస్తులను అందించే కేంద్రంగా ఎదుగుతుంది. ప్రపంచమంతటా తెలంగాణలో తయారైన దుస్తులు ధరించేలా చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాం. ఈ సందర్భంగా ప్రపంచ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నాం. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో మీరూ భాగస్వాములు కావాలి. మాకు అత్యుత్తమ మానవ వనరుల బలముంది. అందరం కలిసి ఒక కొత్త భవిష్యత్తును నిర్మిద్దాం. సరైన ప్రణాళిక, విజన్‌తో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను విజయపథంలో నడిపించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రోత్సాహకాలు అందిస్తాం. వేగంగా అనుమతులు మంజూరు చేస్తాం.

**మన డీఎన్‌ఏలోనే జౌళి ఉంది**

జౌళి మనకు కేవలం పరిశ్రమ కాదు, అది జీవనాడిగా మారింది. మన డీఎన్‌ఏలోనే ఉంది. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ నుంచి గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ నుంచి నారాయణపేట చేనేత వరకు అనేక ఉత్పత్తులు ఇక్కడ ఉన్నాయి. ఈ రంగంలో ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయి. భారతదేశంలో అత్యధికంగా పత్తిని పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. మన పత్తి నాణ్యతకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. నిజాంల పాలనలో ప్రపంచం నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వస్త్రాలు, ముత్యాల కోసం వచ్చేవారు. మేము వరంగల్‌లో ప్రపంచస్థాయిలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతోపాటు అనేక అపరెల్ పార్కులను ఏర్పాటు చేశాం.

# వైకాపా 'నాశనం' చేయాలనుకుంటే.. మనం 'శాసనం' చేశాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించడం ప్రజా విజయమని, రాజధానికి దక్కిన గౌరవమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. పార్లమెంటు ఉభయసభల్లో అన్ని పార్టీల ఎంపీలు అమరావతి బిల్లుకు మద్దతు పలికితే.. వైకాపా ఎంపీలు మాత్రమే దాన్ని వ్యతిరేకించి వాకౌట్ చేశారని ఆయన ధ్వజమెత్తారు. వైకాపా అమరావతిని నాశనం చేయాలనుకుంటే.. మనం దానికి శాశ్వతత్వం కల్పిస్తూ శాసనం చేశామని వ్యాఖ్యానించారు. ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలపడాన్ని వైకాపా అధ్యక్షుడు జగన్ ఓర్వలేకపోతున్నారని, ఇప్పటికీ రాజధానిపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా అమరావతి అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'రాజధానిని నిర్ణయించేందుకు అసెంబ్లీకి, పార్లమెంటుకు హక్కే లేదని జగన్ ఇప్పుడు కొత్త పల్లవి ఎత్తుకున్నారు. సీఎం ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని అంటున్నారు. దీన్ని తిక్క అనాలో, ఇంకేదైనా అనాలో, ఆ తిక్కకు పరిష్కారమేంటో అర్థం కావడం లేదు. పార్లమెంటులో బిల్లు ఆమోదించి చట్టం చేస్తే ప్రభుత్వాలు, పార్టీలు దానికి కట్టుబడాలి. జగన్ మాత్రం చట్టం చేయడానికి ఏం అధికారం ఉందని పార్లమెంటునే ప్రశ్నిస్తున్నారు. ప్రజల్ని మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి వస్తానని, అప్పుడు తనకు నచ్చింది చేస్తానని బెదిరిస్తున్నారు. జగన్ ప్లాన్‌ఏలో భాగంగా మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేయాలనుకున్నారు. ఇప్పుడు ప్లాన్‌బి, మావిగన్ అంటూ తిక్కతిక్కగా మాట్లాడారు. ఆ పేరు పలకడమే నాకిష్టం లేదు. ఆ వ్యక్తి మనస్తత్వం ఏంటో నాకు అంతుచిక్కడం లేదు. ప్రజలకైనా అంతుపట్టిందో లేదో తెలీదు' అని ధ్వజమెత్తారు.

**మద్దతిచ్చినవారిని తప్పుపడుతున్న జగన్**

'అమరావతికి చట్టబద్ధతపై దేశమంతా మనకు అండగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ బాగుండాలని, అమరావతి అభివృద్ధి చెందాలని.. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రాతినిధ్యం ఉన్న 50 పార్టీలు బిల్లుకు సంఘీభావం తెలిపాయి. ఇక్కడి నుంచి గెలిచిన వైకాపా ఎంపీలు మాత్రం రాష్ట్రానికి ద్రోహం చేయాలని చూశారు. అమరావతికి సంఘీభావం తెలిపినవారిని జగన్ తప్పుబడుతున్నారు. వాళ్లేమీ తెలియనివాళ్లు, ఈయనొక్కరే తెలివైనవాడు అన్నట్టుగా మాట్లాడుతున్నారు. బెదిరింపులకు పాల్పడటం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్న కుట్రలు చేస్తున్నారు. మీరేం చేసినా ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందనుకోవద్దు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వారి శాపాలు వారికే తగులుతాయి**

అమరావతిని ఎవరైనా ఆపాలనుకుంటే అది పగటి కలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతికి శాపాలు పెడితే అవి తిరిగి వాళ్లకే తగులుతాయని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో చట్టం చేసినంత మాత్రాన రాజధానిని అమరావతిని మార్చకూడదని లేదని, చట్టాన్ని మార్చుకోవచ్చని వైకాపా నాయకులు అంటున్నారు కదా? అన్న ప్రశ్నకు.. 'వాళ్లకు ఇంగితం ఉండే మాట్లాడుతున్నారా? ఒకసారి రాజధాని కట్టాక తుగ్లక్‌లు వచ్చి మారుస్తామంటే కుదరదు. ఎవరిష్టానికి వాళ్లు చేస్తామంటే కోర్టులు ఊరుకుంటాయా? ఇంత తిక్కగా మాట్లాడేవాళ్లు నాయకులా? వాళ్లలో కొందరు మంత్రులుగానూ పనిచేశారు. వాళ్లు మంత్రులెలా అయ్యారో నాకర్థం కాదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి నాయకులు ఉండటం మన దౌర్భాగ్యం' అని మండిపడ్డారు.

# యువ ఓటర్లే విజయ్ లక్ష్యం

తమిళనాడు : డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు ప్రత్యామ్నాయం అంటూ వచ్చిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) యువ ఓటర్లే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తోంది. వారిని లక్ష్యంగా చేసుకునే టీవీకే అధినేత విజయ్ మ్యానిఫెస్టోను రూపొందించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ, గ్రామీణ యువతను ఆకర్షించేలా విద్య, ఉద్యోగాలు, అందుకోసం ఆర్థిక సహకారంలాంటి ప్రభావవంత హామీల్ని టీవీకే తెచ్చింది. ఇది యువతలో కొత్త ఆశల్ని రేకెత్తిస్తోంది. ఈ హామీల్ని యువతకు వేగంగా చేరవేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు టీవీకే ఐటీ విభాగం శ్రమిస్తోంది.

**గ్రామ పంచాయతీల్లోనే ఉద్యోగం**

ఉన్నచోటే ఉద్యోగం పేరుతో యువతను ఆకట్టుకునే హామీలిచ్చారు విజయ్. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక యువతకే ఉద్యోగాలు వచ్చేలా 'ముఖ్యమంత్రి ప్రజా సేవామిత్ర' పథకాన్ని తీసుకొస్తామని తెలిపారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయని చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలోని కంపెనీలకూ ఓ నిబంధన పెడతామని చెప్పారు. 75శాతం ఉద్యోగాలు తమిళులకే ఇచ్చేలా చేస్తామని తెలిపారు. ఇలా చేసిన వారికి రాష్ట్ర జీఎస్టీలో 2.5శాతం రాయితీ, విద్యుత్తు టారిఫ్‌లో రాయితీ ఉంటుందని వివరించారు. ప్రభుత్వపరంగా సేకరించే ఉత్పత్తుల్లో ఆయా సంస్థలకు ప్రాధాన్యమిస్తామనడం ఆకట్టుకుంటోంది. ఉద్యోగ వేటలో అలసిపోయిన యువతకూ ఊరటనిచ్చేలా ఇంకో హామీ ఇచ్చారు. 29 ఏళ్లు పైబడినా నిరుద్యోగులుగా మిగిలిన వారికి నెలవారీ భృతి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. గ్రాడ్యుయేట్స్‌కు రూ.4వేలు, డిప్లొమా పూర్తి చేసిన వారికి రూ.2వేలు ప్రకటించారు. నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ప్రత్యేక యువ సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామంటున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ఏటా 5 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడంతోపాటు వారికి నెలవారీ స్టైపెండ్ ఇచ్చేలా వరాలు గుప్పించారు. గ్రాడ్యుయేట్స్‌కు నెలకు రూ.10వేలు, ఐటీ గ్రాడ్యుయేట్స్‌కు రూ.8వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

# క్వాంటమ్‌తో కొత్త కళ!

అమరావతి: రాజధాని అమరావతిలో వచ్చే నవంబరు/డిసెంబరుకు క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు.. క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల పరిశోధనలు, అల్గారిథమ్స్, యూజ్ కేసుల రూపకల్పనలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ(ఏక్యూవీ) ఆధ్వర్యంలో 'క్వాంటమ్ అండ్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ (క్యూఏఐసీ)'ను ఏర్పాటు చేస్తోంది. వచ్చే మూడేళ్లలో 100 క్వాంటమ్ ఏఐ అల్గారిథమ్స్, యూజ్ కేసులు అభివృద్ధి చేయడం, 5 వేల మంది విద్యార్థుల్ని క్వాంటమ్ అల్గారిథమ్స్ రాయడంలో నిపుణులుగా తీర్చిదిద్దడం, క్వాంటమ్ టెక్నాలజీపై 600 మందికిపైగా అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం, 100 స్టార్టప్‌లు ప్రారంభమయ్యేలా చూడటం, 100 పత్రాల ప్రచురణ, వందకుపైగా పేటెంట్‌లు సాధించడం, 50కి పైగా పరిశ్రమలతో భాగస్వామ్యం క్యూఏఐసీ ప్రధాన లక్ష్యాలు. దీనికి నలుగురు నుంచి ఆరుగురు సభ్యులతో సలహా కమిటీ ఉంటుంది. అందులో పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థల నిపుణుల్ని సభ్యులుగా నియమిస్తారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటవుతుంది. దానిలో ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల ప్రొఫెసర్లు, ఐబీఎం సంస్థ ప్రతినిధులు, రాష్ట్రంలోని 380 క్వాంటమ్ ఇన్నోవేషన్ సెల్స్ నుంచి నలుగురు ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం గన్నవరంలోని మేధాటవర్స్ నుంచి, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణం పూర్తయ్యాక అక్కడి నుంచి ఇన్నోవేషన్ సెంటర్ పనిచేస్తుంది.

**ఏడాదికి 365 గంటల క్వాంటమ్ క్రెడిట్స్**

ఐబీఎం వంటి సంస్థలు క్వాంటమ్ కంప్యూటర్లను వినియోగించుకున్నందుకు నిమిషానికి ఇంత మొత్తమని ఛార్జీ వసూలు చేస్తాయి. ప్రస్తుతం ఒకేసారి 5,400 నిమిషాల సమయం కొనుగోలు చేస్తే.. ఐబీఎం నిమిషానికి 48 డాలర్లు వసూలు చేస్తోంది. ఏడాదిలోగా ఆ సమయాన్ని వాడేసుకోవాలి. 10 నిమిషాలు.. 20 నిమిషాలు.. ఇలా తక్కువ సమయం కావాలనుకున్న వారి నుంచి నిమిషానికి 96 డాలర్లు చొప్పున వసూలు చేస్తోంది. ఇలా నిమిషాల లెక్కన కేటాయించే సమయాన్ని క్వాంటమ్ క్రెడిట్స్ అంటారు. అమరావతిలో ఏర్పాటు చేసే 133 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ క్వాంటమ్ కంప్యూటర్‌కూ ఐబీఎం ఇవే ధరల్ని నిర్ణయించే అవకాశముంది.

# ఇంట్లో ఈగల మోత.. కేరళంలో పల్లకీల మోత

దామరగద్ద : ''గిరిజనులకు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా.. ఇక్కడ చేశారని చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు.. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్టు ఉంది..'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 'కేరళ ప్రజలు రేవంత్‌లాగా తెలివి తక్కువ వారు కాదు.. మీరు చెప్పింది నమ్మేవారు ఎవరూ లేరు అక్కడ. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేశాం.. ఇక్కడా చేస్తామంటున్నావ్.. అసలు ఏమి అమలు చేశారు? కాంగ్రెస్ పార్టీ పాలన ఏంటో కేరళ యువత గూగుల్‌లో సెర్చ్ చేసి ఉంటారు.. రేవంత్‌రెడ్డి ఏమి చెప్పినా అక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవదు..' అన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతర (లోక్ మసంద్ మహారాజ్ జాతర)కు శుక్రవారం మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బడ్జెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు..'' అని విమర్శించారు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారని, సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్‌బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?.. అని ప్రశ్నించారు

# వేగంగా రైళ్ల అనుసంధానం

హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే సరికొత్త ప్రణాళికలతో ముందుకు వెళుతున్నది. రైళ్ల అనుసంధానంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త రైళ్లతో పాటు లైన్లనూ విస్తరిస్తున్నది. అంతేగాక సమయాన్ని ఆదా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. రైల్వేల నెట్‌వర్క్ పరిధిని సైతం పెంచేందుకు వేగంగా అడుగులు వేస్తున్నది. గూడూరు నుంచి బల్హార్షా వరకు రైలు మార్గం వేయనున్నది. సరుకు రవాణాను మరింత సులభతరం చేయనున్నది. రెండు కోచింగ్ రైళ్ల నిరంతర ప్రయాణంతో వినియోగదారుల అవసరాలను తీర్చనుంది. కాజీపేట నుంచి సికింద్రాబాద్ మీదుగా వాడికి వెళ్లే రైలు మార్గం కూడా అధిక సాంద్రత గల నెట్‌వర్క్ కానుంది. ఈ జోన్‌లోని ప్రధాన రైల్వే నెట్‌వర్క్ అత్యంత రద్దీగా ఉంది. ఈ రద్దీని ఎదుర్కోవడానికి, రాకపోకలను సులభతరం చేసేందుకు, 202526 ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాలను అధికం చేయడంపై రైల్వే శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈనేపథ్యంలో ఈ జోన్ పరిధిలో 194.57 కిలోమీటర్ల మేర ట్రాక్ పెంచేందుకు ప్రణాళికలు రూపొందించింది. వీటిలో కొత్త రైలు మార్గాలు , రైల్వే లైన్ల డబ్లింగ్‌తోపాటు ట్రిపుల్లింగ్ నిర్మాణాలు సైతం చోటుచేసుకోనున్నాయి.

# సంజు శాంసన్ రియల్ ప్లేయర్ పీఎం

టీమిండియా స్టార్ బ్యాటర్, కేరళ ఆటగాడు సంజూ శాంసన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ కనబరిచిన అద్భుతమైన ఆటతీరును ఆయన కొనియాడారు. కేరళ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల అమోఘమని అన్నారు. జట్టుకు అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేసేవాడే నిజమైన ఆటగాడని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తోంది. కేరళ ప్రజలు కూడా సంజూ శాంసన్ ప్రదర్శన నుంచి నేర్చుకోవాలి. ప్రపంచకప్‌లో శాంసన్ ఆటతీరును మనం చూశాం. టోర్నమెంట్‌లో కీలకమైన నాకౌట్ దశ వచ్చినప్పుడు, అతని ప్రదర్శన అకస్మాత్తుగా శిఖర స్థాయికి చేరింది.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందని జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, టీఎన్జీఓస్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగెల్లి మురళి, జె.శేఖర్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమర వీరుడిగా నిలిచి, ఆయన త్యాగం ప్రజల్లో స్వేచ్ఛా భావాన్ని, సమానత్వం కోసం పోరాడే స్ఫూర్తిని నింపిందన్నారు.దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి దీప్తిగా నిలిచి, రైతాంగంలో చైతన్యం నింపిందని తెలిపారు.ఆయన ఆశయాలు సామాజిక న్యాయం సాధనకు నేటికీ మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సంజీవయ్య, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, టీఎన్జీవోస్ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగెల్లి మురళి, జె.శేఖర్ రెడ్డి, వార్డెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రణదీవె, యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు కదారి యాదయ్య, చింతకాయల రామచంద్రు, తరాల జగదీష్, అల్లి సతీష్, రాయనబోయిన రాంబాబు, బారి శ్రీనివాస్, టీఎన్జీవోస్ నాయకులు సత్యనారాయణ, సుమన్, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ లో మాజీమంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ :. కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని తిమ్మారెడ్డిపల్లి లో వెలసిన శ్రీ గురు లోకానందు సంత్ మహారాజ్ దేవస్థానం జాతర ఉత్సవాలకు బయలుదేరి వస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు షాద్ నగర్ చేరుకోగానే రోడ్డుపై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో వందలాది కార్యకర్తలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గం లోని ఆయా మండలాలు గ్రామాల నుండి అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హరీష్ రావు జిందాబాద్ అంజన్న జిందాబాద్ అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు పై అభిమానులు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య తో పాటు మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్ రాష్ట్ర సహకార సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజవరప్రసాద్, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రాంబాబు నాయక్ మిట్టు నాయక్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్ మాజీ కౌన్సిలర్లు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## అమ్మవారి దీవెనలు మనందరిపై ఉండాలి

* **కేశంపేట మండల మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కొండారెడ్డి పల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వీరనాగమ్మ మాత కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలని కోరుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో త్రిప్పిశెట్టి సుదర్శన్, డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యులు, కర్నెకోట వంశ భక్త బృందం, సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఖమ్మంలో భక్తిశ్రద్దలతో "గుడ్ ఫ్రైడే " వేడుకలు



ఖమ్మం జిల్లా , ప్రజాస్ఫూర్తి : ఖమ్మం నగరంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్దాలతో నిర్వహించారు . లోకరక్షణ కోసం ఏసుక్రీస్తు సీలువపై పడిన శ్రమలను స్మరిస్తూ వైరా రోడ్డులో ఆర్సీఎం చర్చ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా, కరుణగిరికి సిలువ యాత్ర సాగింది . డీజేల్లో భక్తి గీతాలు ఆలపిస్తూ , ప్రత్యేక ప్రార్దనలతో కరుణగిరి వరకు ఈ యాత్ర సాగింది .నగర విదులన్నీ ఆద్యాత్మిక వతావరణంతో నిండిపోయాయి .

## తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

* **చికెన్ షాప్ నిర్వాహకుల నాయకుడు రాజు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : తాము చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవేనని వాటిని వెంటనే పరిష్కరించాలని చికెన్ షాప్ నిర్వాహకుల నాయకుడు రాజు పౌల్ట్రీ సంస్థల అధినేతలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చికెన్ షాపుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ షాప్ నిర్వాహకుల నాయకుడు రాజు మాట్లాడుతూ ఇటీవల కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు మీడియాలో చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. కంపెనీలు స్కిన్లెస్ కోళ్లు తమకు సరఫరా చేయవని, లైవ్ కోళ్లనే తమకు సరఫరా చేస్తాయని తెలిపారు. రిటైల్ షాపుల వద్దకు చేరే సరికి ఒక్కో కోడి బరువు సుమారు 100 గ్రాములు తగ్గిపోతుందని, ఆ తరుగు వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు ఆ నష్టానికి సంబంధించిన మొత్తాన్ని తమకు చెల్లించాలనే డిమాండ్ను తాము చేస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్ను కంపెనీలు అంగీకరించాలని డిమాండ్ చేశారు.

## చెన్నై మైలాపూర్ నుంచి తమిళిసై పోటీ

* **తమిళనాట భాజపా అభ్యర్థుల జాబితా విడుదల**

సైదాపేట: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే భాజపా అభ్యర్థుల జాబితా శుక్రవారం విడుదలైంది. ఎన్డీఏ పొత్తులో భాగంగా భాజపాకు 27 సీట్లు కేటాయించగా, మొత్తం అభ్యర్థులను ఒకే దఫాలో ప్రకటించారు. పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెన్నై మైలాపూర్ నుంచి, ప్రస్తుత అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విరుదునగర్ జిల్లా సాత్తూర్ నుంచి, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ తిరుప్పూర్ జిల్లా అవినాశిలో పోటీ చేస్తున్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఐక్యత, సాంప్రదాయానికి నిదర్శనం

* **బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి , షాద్నగర్ : కొండారెడ్డిపల్లి గ్రామంలో భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ వీరనాగమ్మ మాత కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ గారు ఘనంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు గ్రామ పెద్దలు, భక్తులు సంప్రదాయబద్ధంగా పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం వీరనాగమ్మ మాతను దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖశాంతులు, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు. ఈ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి పరవశంతో నిండిపోయి, భక్తుల రద్దీతో కళకళలాడింది. మహిళలు, యువత, వృద్ధులు అన్నివర్గాల వారు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మాట్లాడిన వై. రవీందర్ యాదవ్ గారు, గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో ఐక్యత, సాంప్రదాయ విలువలు మరింత బలపడతాయని తెలిపారు. మన పూర్వీకుల సంస్కృతి, ఆచారాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ జిలెల్ల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సర్పంచులు వేణుగోపాల్, రమేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, సురేందర్, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి, నరేష్, దశరథ, జమాల్ ఖాన్, సాజిద్, వినోద్, నిరంజన్, శ్రీశైలం, ఉదయ్ గౌడ్, శ్రీనివాస్, బాలు, రాజేష్, వెంకటేష్, శ్రీను తదితరులు, మండల బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

* **అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో.**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం, కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మేరకు తెలంగాణ సాయుధ పోరాటలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, దొడ్డి కొమరయ్య చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమము నిర్వహించిన జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు, ఐ డి ఓ సి కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే.. పేదల సొంతింటి కల సాకారం

* **నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం**
* **ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బోనకుర్తి సునీత హరికృష్ణ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బోనకుర్తి సునీతహరికృష్ణలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్నారన్నారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, నిరుపేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనువాస్, ఐతరాజు లింగస్వామి శారద, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ కొండల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు నారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఊదరి శంకర్, ఊదరి నర్సింహ, దాకోజీ సతీష్ వల్లబోతు నరేష్, సురేష్, జంగం సందీప్ బత్తుల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ ప్రారంభం

* **చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం భాస్కర్ థియేటర్ పక్కన, పాత ఎస్ బీ ఐ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ ను చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. షాపు యజమానులు టి శంకర్ కుమారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చౌటుప్పల్ లాంటి పట్టణంలో పెద్ద బ్రాండ్ అయిన జాకీని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చిన యాజమాన్యాన్ని అభినందించారు. హైదరాబాద్ కు వెళ్లకుండా పెద్దపెద్ద బ్రాండ్లు చౌటుప్పల్ కి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం షాపు యజమాన్యం చైర్మన్ దంపతులకు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వినియోగదారులను ఉద్దేశించి పి శంకర్ మాట్లాడుతూ జాకీ 1876లో స్థాపించడం జరిగిందని, జాకీ పెద్ద బ్రాండ్ అన్నారు. ఆధునిక స్టైల్, యువతను ఆకట్టుకునేలా రూపొందించిన ఆధునిక జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ కలిగి ఉందన్నారు. పురుషులు, మహిళలు, పిల్లల కోసం విస్తృత శ్రేణి దుస్తులు, లోదుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. సరసమైన ధరలకే వినియోగదారులకు అందులో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, బుడ్డ సురేష్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త మంచికంటి భాస్కర్ గుప్త, కాంగ్రెస్ పార్టీ నాయకులు తొర్పునూరి నరసింహ గౌడ్, గోశిక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు సమయం కేటాయిస్తా : ఎమ్మెల్యే



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ ను తెలంగాణ ఉద్యమకారులం కలవడానికి నిర్ణయించుకున్నం. ఎమ్మెల్యేని ఫోన్లో సంప్రదించగా, ఆదివారం మనకోసం సమయం కేటాయించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. దయచేసి అందరూ జమకండి.ఆదివారం నాడు ఆయనను కలిసే విషయం శనివారం ఎమ్మెల్యే మరోసారి సంప్రదించి,కలిసే సమయం తెలుసుకుని పర్సనల్గా అందరికీ ఫోన్ చేయడం జరుగుతుంది, గ్రూప్లో కూడా సమయం తెలియజేయడం జరుగుతుంది. దయచేసి అందరూ రావలసిందిగా మనవి.తెలంగాణ మలిదశ ఉద్యమకారులు మహబూబాబాద్. పుచ్చకాయల రామకృష్ణ,అహ్మద్ ఖాన్,దార్ల శివరాజ్,బాషికాల అంబరీష,నదీం ఖాన్,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలో జనగణన పనులు పకడ్బందీగా చేయాలి: కలెక్టర్ అంకిత్




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని కవర్ చేస్తూ ఎలాంటి లోపాలు లేకుండా డేటా సేకరణ జరగాలని సూచించారు.జనగణనలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 3 వరకు ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్కు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఫీల్డ్ సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్స్గా ఎన్. శివరామకృష్ణ, డా. పి. సుస్మిత రజిని శిక్షణ అందించగా, 34 మంది ఫీల్డ్ ట్రైనీస్ పాల్గొన్నారు. హౌస్ సెన్సెస్ విధానం, డేటా సేకరణలో జాగ్రత్తలు, డిజిటల్ విధానాల వినియోగంపై వివరించారు.శిక్షణలో భాగంగా పాలకోయ తండాలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరణ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కలెక్టర్ సమక్షంలో మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ నిర్వహించారు.జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు కీలకమని కలెక్టర్ తెలిపారు. ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెన్సెస్ అధికారులు, సీపీఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి నియోజకవర్గం లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ కాంగ్రెస్

- **జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు.**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రెస్ మీట్ ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గం అన్ని రంగాలలో, అన్ని వర్గాలకు నిధులను తీసుకొస్తు మాటలతో కాకుండా పని చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన పథకాలపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ లు అందచేస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇస్తా అని తుంగలో తొక్కడం జరిగిందన్నారు. దళితులకు గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఎంతమందికి ఇచ్చారు. రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయలేకపోయిందన్నారు. దళిత బంధు పథకం అర్హులకు కాకుండా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఇచ్చింది. బీసీ బంధు పథకం ఎంత మందికి ఇచ్చారు.గ్రామాలలో యాదవ సోదరుల నుండి డబ్బులు తీసుకొని గొర్రెల పంపిణీ పథకం గాలికి వదిలి వేయడం జరిగిందన్నారు.ఈ ప్రెస్ మీట్ లో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్ సాగర్, జిల్లా అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, శర్వాంద, జిల్లా కార్యదర్శి బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సబ్‌రిజిస్ట్రార్2 నివాసాల్లో ఏసీబీ సోదాలు

* ఆదాయానికి మించిన ఆస్తులు గుర్తింపు



కాజీపేట: వరంగల్ సబ్‌రిజిస్ట్రార్2గా పనిచేస్తున్న దావులూరి ఆనంద్‌రావు నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేసి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. హనుమకొండలోని కార్యాలయంలో ఏసీబీ ఏసీపీ సాంబయ్య తన బృందంతో కలిసి గురువారం ఆకస్మిక సోదాలు ప్రారంభించగా శుక్రవారం వరకు కొనసాగాయి. ఆనంద్‌రావుకు చెందిన హనుమకొండ పరిమళ కాలనీలోని, ఖమ్మంలోని నివాసాల్లో నిర్వహించిన సోదాల్లో రూ.24,61,540 నగదు, 819.500 గ్రాముల బంగారు, 2.600 కిలోల వెండి ఆభరణాలు లభించాయి. రూ.30.10 లక్షల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితోపాటు తనిఖీలు చేసిన సమయంలో కార్యాలయంలో 20 మంది అనధికార ఏజెంట్లు, దస్తావేజు లేఖరులను గుర్తించారు. కార్యాలయంలో రూ.47,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. 70 నమోదుకాని దస్తావేజులు లభించాయి. దస్తావేజు లేఖరుల సెల్‌ఫోన్లను పరిశీలించగా సబ్‌రిజిస్ట్రార్ 1 జమలాపురం రామనరసింహారావు, ఆనంద్‌రావులతో చేసిన వాట్సప్ చాట్‌లు బయటపడ్డాయి. లేఖరులు, వారి మధ్య ఏడాదిలో సుమారు రూ.42,03,125 విలువైన లావాదేవీలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. తనిఖీల్లో మరిన్ని అక్రమాలు గుర్తించామని, ప్రభుత్వానికి వివరాలు సమర్పించి చర్యలు తీసుకుంటామని సాంబయ్య పేర్కొన్నారు.

# ఈనామ్ 2.0తో ఇబ్బందులు!

* ఆగిపోయిన పసుపు విక్రయాలు
* బహిరంగ వేలం ద్వారా వ్యాపారుల కొనుగోళ్లు



నిజామాబాద్ వ్యవసాయం: రైతులు తమ పంటను దేశంలో ఎక్కడైనా అమ్ముకునేలా కేంద్ర ప్రభుత్వం 2014లో ఈనామ్ 1.0ను ప్రవేశపెట్టింది. దీన్ని మరింత వృద్ధిపరిచి ఈ ఏడాది 'ఈనామ్ 2.0'ను తీసుకొచ్చింది. అయితే, సిబ్బందికి కనీసం శిక్షణ ఇవ్వకుండా అమలు చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. పంట నమోదులో తప్పిదాలు (ఎర్రర్) చూపించడం, బిడ్డింగ్‌లో సమస్యలు, ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్ల లాగిన్లలో ఇబ్బందులు, రైతులకు మంచి ధర వచ్చే అవకాశం లేకపోవడం, ఒక్క రోజులో పూర్తయ్యే అమ్మకాలకు మూడు రోజులు పట్టడం.. వంటి ప్రధాన సమస్యలు తలెత్తుతున్నాయి. ఫిబ్రవరి 27న ఈనామ్ 2.0 ప్రవేశపెట్టగా లాట్ల కేటాయింపులు జరగకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు బహిరంగ వేలం ద్వారా పసుపు కొనుగోళ్లు చేపట్టగా రైతులు క్వింటాకు రూ.వెయ్యి వరకు నష్టపోయారు. తాజాగా శుక్రవారమూ అదే పరిస్థితి ఎదురైంది. నిజామాబాద్ మార్కెట్ యార్డుకు 30 వేల బస్తాల పసుపు రాగా ఉదయం 8 గంటల నుంచి అధికారులు తీవ్రంగా శ్రమించాక వెయ్యి బస్తాలకు మాత్రమే లాట్లు ఇవ్వగలిగారు. తర్వాత సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తడంతో గత్యంతరం లేక బహిరంగ వేలం ప్రారంభించడంతో వ్యాపారులు పంట కొనుగోలు చేశారు. వేలం విధానంలో సాధారణంగా కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులకు మాత్రమే లాభం ఉంటుంది. వారు నిర్ణయించిన ధరకే రైతులు పంటను విక్రయించాల్సి వస్తుంది. సిబ్బందికి ఈనామ్ 2.0పై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి.. సాంకేతిక సమస్యలను అధిగమించిన తర్వాతే అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# అంజన్నకు మొక్కి.. కొండగట్టుకు ప్రణమిల్లి



మల్యాల : ఇక్కడ సాష్టాంగ ప్రణామాలు చేస్తున్న వారు మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన హనుమాన్ దీక్షాపరులు. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఘాట్ రోడ్డు ప్రారంభం నుంచి దాదాపు 2 కిలోమీటర్ల మేర 15 మంది దీక్షాపరులు సాష్టాంగ ప్రణామాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. మొక్కులో భాగంగా ప్రతి 11 అడుగులకు ఒకసారి ఇలా ప్రణామాలు చేసినట్లు వారు తెలిపారు. దాదాపు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి.

# జనాభా లెక్కల కోసం శిక్షణ పొందుతున్న అధికారులకు సూచనలు

* భారతి హోలికేరి, డైరెక్టర్ జనాభా లెక్కల అధికారి హైదరాబాద్



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో జరుగుచున్న జనాభా లెక్కల ఏర్పాట్లు పరిశీలించారు. ఇందులో భాగాంగా మండల స్థాయి మాస్టర్ శిక్షణ అధికారుల సమావేశానికి హాజరయ్యారు. శిక్షణ పొందుతున్న అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనాభా లెక్కల అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధముగా నిబంధన ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణన చేయాలని, ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళికలు రూపొందించడానికి జనాభా గణాంకాలు కీలకంగా ఉంటాయన్నారు. ఈ గణన దేశంలో మొదటిసారిగా డిజిటల్ విధానం ద్వారా మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ల ను ఉపయోగించి ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్ ను జనాభా గణన ప్రారంభానికి ముందు అందుబాటులో కి తీసుకువస్తామని తెలిపారు. జనాభా లెక్కల గణనలో మండల స్థాయి శిక్షణ ఆదికారులకు తగిన సూచనలు చేసి, శిక్షణను సద్వినియోగం చేసుకొని తిరిగి వారు మండలలోని ఎన్యుమరేటర్లు మరియు సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చి జనాభా లెక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# విద్యా కమిషన్ సిఫార్సులపై సమగ్ర చర్చ జరగాలి

* టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్టుపై సమగ్ర చర్చ జరపాలని, ప్రభుత్వ విద్యా రంగానికి నష్టం కలిగించే అంశాలను, ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించే అంశాలను తిరస్కరించి, విద్యాభివృద్ధికి దోహదపడే అంశాలను అమలుచేయాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. టిఎస్‌యుటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో బి మురళీ మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చావ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ నిపుణులతో చర్చించకుండా, కనీసం అసెంబ్లీలో చర్చకు పెట్టకుండా ఏకపక్షంగా అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదని ఆయన అన్నారు. కనీసం గ్రామ పంచాయతీకి ఒక పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అందుకనుగుణంగా జిఒ 25ను సవరించాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లు తెలంగాణ రెండో పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పీఆర్సీ గడువు పొడిగించకుండా, వెంటనే నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, మోడల్ స్కూల్స్, గురుకులాల ఉద్యోగులకు 010, హెల్త్ కార్డులు అమలు చేయాలని తదితర తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వర్లు, బి.కిషోర్ సింగ్, జిల్లా కార్యదర్శిలు ఎస్కె పాషా, హథీరాం, ఎం పద్మారాణి, పి. జయరాజు, తావూరియా, విజయ్ కుమార్, మంజీలాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఇక వేలిముద్రలుండవు.. అన్నీ సంతకాలే


* అక్షరాస్యులుగా మారిన 6.31 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు

హైదరాబాద్: వరంగల్ జిల్లా సంగెం మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘం సభ్యురాలు లక్ష్మి ఆరు నెలల క్రితం వరకు బ్యాంకుకు వెళ్లి వేలిముద్ర వేస్తుండేది. తమ సంఘం సమావేశంలోనూ అదే పనిచేసేది. ఇప్పుడు ఆమె బ్యాంకుకు వెళ్లి ఆంగ్లంలో సంతకం చేయగానే అక్కడున్న సిబ్బంది అంతా ఆశ్చర్యపోయారు. లక్ష్మి ఒక్కరే కాదు. రాష్ట్రవ్యాప్తంగా 6.31 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో చేపట్టిన 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో అక్షరాస్యులయ్యారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని 4.37 లక్షల సంఘాల్లో 46.68 లక్షల మంది, పట్టణ ప్రాంతాల్లో 1.73 సంఘాల్లో 17.60 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరందరి విద్యార్హతలపై గత ఏడాది సెర్ప్ సర్వే నిర్వహించింది. 12 లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉన్నట్లు గుర్తించి అక్షరజ్ఞానం అందించాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ప్రణాళిక రూపొందించారు.

**సాయంత్రం వేళల్లో చదువు**

ఒక్కో గ్రామంలో 40 నుంచి 60 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించి, 8 నుంచి 10 మందిని బృందాలుగా చేసి 'అమ్మకు అక్షరమాల' పేరిట సాయంత్రం వేళల్లో చదువు చెప్పే కార్యక్రమం మొదలైంది. గ్రామస్థాయిలో వాలంటీర్లు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు మహిళలకు బోధించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమాన్ని తెలంగాణ వయోజన విద్యాశాఖతో సమన్వయం చేశారు. వాలంటీర్లు, ఫెసిలిటేటర్లకు వివిధ స్థాయిల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు పలకలు, నోట్‌పుస్తకాలు, ప్రాథమిక అభ్యాస సాధనాలను ఉచితంగా అందజేసి బోధించారు. దీంతో మహిళలు మొదట తమ పేర్లు, గ్రామం, జిల్లా పేర్లను గుర్తించడం నుంచి.. క్రమంగా చదవడం, రాయడం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,01,357 మంది చదువు నేర్చుకున్నారు. మార్చి 29న నిర్వహించిన ఉల్లాస్ అక్షరాస్యత పరీక్షకు 6,31,656 మంది హాజరయ్యారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు చదువు కొనసాగిస్తూ... ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలని సెర్ప్ నిర్ణయించింది. ఈ అక్షరాస్యత కార్యక్రమం ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతున్నారు' అని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ తెలిపారు.

# వైభవంగా శ్రీశ్రీ పంచముఖ హనుమాన్ ఆలయంలో మండల పూజ



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రింగ్ బస్తి లో శ్రీశ్రీ పంచముఖ హనుమాన్ ఆలయంలో 41 వ రోజు మండల పూజ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బి ఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం పొందుతారన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి కృపాకటాక్షాలతో డివిజన్ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో. డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పాపయ్య గౌడ్, మల్లారెడ్డి, నరేందర్ రాజు, వెంకటేష్, వినోద్, రాయి విగ్నేష్, సందీప్, జైపాల్ రెడ్డి. ఆంజనేయులు, మైలారం రాజు, శ్రావణి, రాఘవేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌కు 'ఈగల్ ఫోర్స్' పనితీరు వెల్లడి



హైదరాబాద్: తెలంగాణ ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్ ఫోర్స్) పనితీరుపై ఆ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మాదకద్రవ్యాల వ్యాప్తిని నిరోధించేందుకు చేపడుతున్న చర్యల గురించి వెల్లడించారు. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు అమలు చేస్తున్న వ్యూహాల గురించి వివరించారు. ఇందులో భాగంగా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతోపాటు ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటున్న తీరును వెల్లడించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# అస్సాంకు చొరబాటుదారుల నుంచి విముక్తి కలిగిస్తాం : అమిత్ షా

దూధ్నోయ్/పలాశ్‌బారీ: అస్సాంలో గిరిజన అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు ప్రణాళికను సిద్ధం చేశారని, దానిని అమలుచేసేలా భాజపాకు ఓటు వేసి గెలిపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గోల్‌పారా జిల్లాలోని దూధ్నోయ్, కామరూప్ జిల్లాలోని పలాశ్‌బారీలో శుక్రవారం జరిగిన వేర్వేరు ర్యాలీల్లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ఎన్నడూ ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేయలేదని, మోదీ అటువంటి పరిస్థితిని మార్చి ద్రౌపదీ ముర్మును దేశ ప్రథమ పౌరురాలిగా చేశారని అమిత్ షా పేర్కొన్నారు. "రాష్ట్రాన్ని చొరబాటుదారులకు కేంద్రంగా కాంగ్రెస్ మార్చింది. భాజపా అధికారంలోకి వస్తే చొరబాటుదారుల పట్ల కఠినంగా వ్యవహరించి రాష్ట్రానికి వారి నుంచి విముక్తి కలిగిస్తుంది. కాంగ్రెస్ పాలనలో గిరిజన అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ.25,000 కోట్లు. గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించిన మోదీ ప్రభుత్వం దాన్ని రూ.1.38లక్షల కోట్లకు పెంచింది.

# సులువుగానే పోతాయి... కానీ!



**హెయిర్‌స్ప్రే:** దుస్తులమీద పెన్ను గీతలు పడుతుంటాయి. ఇంకూ చిమ్ముతుంది. ముఖ్యంగా లేత రంగు దుస్తుల్లో ఇవి మరీ కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. అలాంటప్పుడు వెంటనే అక్కడ కాస్త హెయిర్‌స్ప్రే చేసి టిష్యూతో అద్దండి. మరక పోయేవరకూ... ఇలా మూడు నాలుగు సార్లు చేస్తే సరిపోతుంది.

**నిమ్మరసం:** మరకల్ని వదిలించాలనే ఆలోచనతో వెంటనే వేణ్నీళ్లు ఉపయోగించి శుభ్రం చేయొద్దు. ఇవి వాటిని మరింత మొండిగా మారుస్తాయి. పసుపు రంగుని తొలగించడానికి నిమ్మరసం, ఉప్పుని చల్లి... అరగంట తర్వాత అక్కడ బ్రష్‌తో రుద్దాలి. ఆపై చల్లటి నీటితో ఉతకండి. ఒక్కసారిగా పోదు కానీ... మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తే ఫలితం ఉంటుంది. ఈ రెండింటినీ కలిపి దుస్తులపై తుప్పు మరకలు పడిన చోట రాసి ఉతికినా వదిలిపోతాయి.

**వైట్ వెనిగర్:** పట్టు చీరలు, లేత రంగు దుస్తులపై చెమట మరకలు స్పష్టంగా కనిపిస్తాయి. అలానే డియోడరెంట్ మరకలూ అంతే! మరక పడిన ప్రాంతంలో వైట్ వెనిగర్ చల్లి, పైన కాస్త బేకింగ్ సోడా రాసి... ఓ పదినిమిషాలు వదిలేయాలి. తర్వాత మృదువుగా రుద్ది, కుంకుడు రసంతో ఉతకండి. వదిలిపోతాయి.

**పనిచేస్తున్నప్పుడో, అనుకోకుండానో ఒక్కోసారి దుస్తులపై మరకలు పడుతుంటాయి. అవి మొండిగా మారకముందే సులువుగా వదిలించేయొచ్చు. అదెలాగంటే...**





# కిరాయి హంతకుల అవతారం ఎత్తిన అమెరికా మాజీ సైనికులు... యూఏఈ కోసం యెమెన్‌లో హత్యలు!

- యూఏఈ కోసం అమెరికా మాజీ సైనికులు రహస్య హత్యలు చేశారని ఆరోపణ
- యెమెన్‌లో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకున్న కిరాయి సైన్యం
- నెలవారీ వేతనం రూ.12.5 కోట్లు, హత్యలకు ప్రత్యేక బోనస్‌లు ఇచ్చారని ఆరోపణ
- 2015లో తనపై జరిగిన హత్యాయత్నంపై యెమెన్ నేత అమెరికాలో దావా
- హత్యల కార్యక్రమాన్ని తానే నడిపానంటూ గతంలోనే సైనికుడి అంగీకారం




వాషింగ్టన్, ఏప్రిల్ 04: అమెరికాకు చెందిన మాజీ సైనికులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కోసం ఒక రహస్య బృందంగా ఏర్పడి అనేక హత్యలు చేశారంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యెమెన్‌లోని రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని ఈ హత్యలు జరిపినట్లు అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) తన కథనంలో వెల్లడించింది. ఈ వ్యవహారంపై యెమెన్‌కు చెందిన ఓ రాజకీయ నాయకుడు అమెరికా కోర్టులో దావా వేయడంతో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే, అమెరికా మాజీ సైనికులైన అబ్రహాం గోలన్, ఐజాక్ గిల్‌మోర్ కలిసి శాన్ డియాగోలో 'స్పియర్ ఆపరేషన్స్ గ్రూప్' అనే ప్రైవేట్ మిలిటరీ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా యూఏఈతో ఒప్పందం కుదుర్చుకుని, యెమెన్‌లో లక్షిత హత్యలకు (టార్గెటెడ్ అసాసినేషన్స్) పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, స్పియర్ ఆపరేషన్స్ సంస్థకు నెలకు 15 లక్షల డాలర్లు (సుమారు రూ. 12.5 కోట్లు), విజయవంతమైన ప్రతీ హత్యకు అదనపు బోనస్‌లు అందేవని కోర్టు పత్రాల్లో పేర్కొన్నారు. యెమెన్‌కు చెందిన చట్టసభ సభ్యుడు, అల్‌ఇస్లాహ్ పార్టీ నేత అన్‌సాఫ్ అలీ మాయో ఈ దావా వేశారు. 2015లో తనను హత్య చేయడానికి యూఏఈ ప్రభుత్వం అబ్రహాం గోలన్‌ను నియమించిందని ఆయన ఆరోపించారు. 2015 డిసెంబర్ 29న, అడెన్ నగరంలోని తన కార్యాలయంపై స్పియర్ ఆపరేషన్స్ బృందం బాంబు దాడికి పాల్పడిందని, తాను కొద్ది నిమిషాల ముందే అక్కడి నుంచి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డానని మాయో తెలిపారు. "పదేళ్ల క్రితం వారు నన్ను చంపడానికి ప్రయత్నించారు. నేను బతికినా, నా కుటుంబాన్ని వదిలి దేశాంతర జీవితం గడుపుతున్నాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తర్వాత భయంతో సౌదీ అరేబియాకు వలస వెళ్లినట్లు పేర్కొన్నారు. 2015లో ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను ఆక్రమించుకున్న నేపథ్యంలో, యూఏఈ సౌదీ నేతృత్వంలోని కూటమిలో చేరి సైనిక చర్యలు చేపట్టింది. ఈ సమయంలోనే అల్ ఇస్లాహ్ పార్టీ నేతలను యూఏఈ లక్ష్యంగా చేసుకుంది. అయితే, అల్ఇస్లాహ్ ఒక చట్టబద్ధమైన రాజకీయ పార్టీ అని, కేవలం యూఏఈ విధానాలను విమర్శించినందుకే వారిని టార్గెట్ చేశారని నిపుణులు అంటున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ, 2018లో బజ్‌ఫీడ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్రహాం గోలన్ స్వయంగా ఈ హత్యల కార్యక్రమం గురించి మాట్లాడారు. "యెమెన్‌లో టార్గెటెడ్ అసాసినేషన్ ప్రోగ్రామ్ ఉంది. దాన్ని నేనే నడిపాను. యూఏఈ కూటమి ఆమోదంతోనే మేము ఇది చేశాం" అని ఆయన అంగీకరించారు. అయితే, యూఏఈ అధికారులు మాత్రం ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు మాత్రమే మద్దతిచ్చామని, రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకోలేదని వాదిస్తున్నారు. అమెరికా చట్టంలోని 'ఏలియన్ టార్ట్ స్టాట్యూట్' కింద మాయో ఈ దావా వేశారు. గోలన్, గిల్‌మోర్ తదితరులపై యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. ఈ కేసు, విదేశాల్లో అమెరికా మాజీ సైనికులు ప్రైవేట్ మిలిటరీ కాంట్రాక్టర్లుగా చేసే చట్టవ్యతిరేక చర్యలపై, వారిని జవాబుదారీగా నిలపాల్సిన అమెరికా ప్రభుత్వ బాధ్యతపై తీవ్ర చర్చకు దారితీసింది.



# ఢిల్లీలో నకిలీ
## 'సెన్సోడైన్' పేస్ట్ ఫ్యాక్టరీ గుట్టురట్టు!

- ఢిల్లీలో రెండు వేర్వేరు ముఠాల గుట్టురట్టు
- బట్టబయలైన నకిలీ టూత్‌పేస్ట్ తయారీ కేంద్రం
- మరో చోట గడువు తీరిన ఆహార పదార్థాల రీప్యాకింగ్ దందా
- మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- భారీగా నకిలీ సరుకులు, యంత్రాలు స్వాధీనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 03: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న రెండు వేర్వేరు ముఠాల గుట్టును ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రట్టు చేశారు. ఒక ముఠా ప్రముఖ బ్రాండ్ పేరుతో నకిలీ టూత్‌పేస్ట్‌ను తయారు చేస్తుండగా, మరో ముఠా గడువు ముగిసిన ఆహార పదార్థాలను రీప్యాక్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తోంది. ఈ రెండు ఘటనలకు సంబంధించి మొత్తం నలుగురిని అరెస్ట్ చేశారు. అనారోగ్యకరమైన వాతావరణంలో ఈ దందాలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, ఖచ్చితమైన సమాచారంతో క్రైమ్ బ్రాంచ్ బృందం గురువారం ఖంజావాలాలోని ఓ గోడౌన్‌పై దాడి చేసింది. అక్కడ ప్రముఖ బ్రాండ్ 'సెన్సోడైన్' పేరుతో నకిలీ టూత్‌పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో హరి ఓం మిశ్రా (58) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. సుమారు 1,800 నకిలీ టూత్‌పేస్ట్ ట్యూబులు, 10,000కు పైగా ఖాళీ ట్యూబులు, ప్యాకింగ్ సామాగ్రి, తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఆపరేషన్‌లో భాగంగా ద్వారకా ప్రాంతంలో ఓ ముఠా గుట్టును పోలీసులు బయటపెట్టారు. గడువు తేదీ ముగిసిన లేదా దగ్గర పడుతున్న ప్రముఖ బ్రాండ్ల శీతల పానీయాలు, బిస్కెట్లను వీరు రీప్యాక్ చేస్తున్నారు. పాత తేదీలను థిన్నర్లతో చెరిపివేసి, కొత్త తయారీ, గడువు తేదీలను ముద్రించి మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈ ఘటనలో కమల్ ముద్గిల్ (56), శివం సింగ్ (27), లోకేశ్ కుమార్ (35) అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు. దాదాపు 3,000కు పైగా కూల్ డ్రింక్ క్యాన్లు, పెద్ద మొత్తంలో బిస్కెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతా అధికారులకు సమాచారం అందించి, నమూనాలను సేకరించారు. రెండు ఘటనలపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# హర్మ్యూజ్ జలసంధిని తెరవగలిగితే ఇక చమురు వెల్లువే!: ట్రంప్

- హర్మ్యూజ్ జలసంధిని తెరిచి చమురుతో భారీగా సంపద సృష్టిస్తామన్న ట్రంప్
- గల్ఫ్‌లో ఉద్రిక్తతల నడుమ నెమ్మదిగా పుంజుకుంటున్న నౌకా రవాణా
- వరుసగా మూడో రోజు జలసంధి గుండా 16 నౌకలు ప్రయాణించినట్లు వెల్లడి
- ఇరాన్ నియంత్రణలోని మార్గాన్ని తప్పించుకుని ప్రయాణిస్తున్న కొన్ని నౌకలు



వాషింగ్టన్, ఏప్రిల్ 3: గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హార్మ్యుజ్ జలసంధిని తిరిగి తెరిచి, చమురుతో భారీగా సంపద సృష్టించవచ్చని ఆయన అన్నారు. ఇది ప్రపంచానికి ఒక 'జాక్‌పాట్' అవుతుందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "మరికొంత సమయం ఇస్తే, మనం సులభంగా హర్మ్యూజ్ జలసంధిని తెరవవచ్చు, చమురును తీసుకోవచ్చు, భారీగా సంపద కూడబెట్టవచ్చు. ఇది ప్రపంచానికి ఒక వరం అవుతుంది కదా?" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వెలువడుతున్న తరుణంలోనే, సముద్రయాన ఇంటెలిజెన్స్ సంస్థ 'విండ్‌వార్డ్' తాజా డేటాను విడుదల చేసింది. ఏప్రిల్ 1న 16 నౌకలు ఈ జలసంధిని దాటాయని, అంతరాయం తర్వాత నౌకల రాకపోకలు జరగడం ఇది వరుసగా మూడో రోజని తెలిపింది. గత మార్చి మధ్యలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పర్యవేక్షణలో తప్పనిసరి నావిగేషన్ కారిడార్‌ను అమలులోకి తెచ్చింది. దీంతో అనేక నౌకలు తమ మార్గాలను మార్చుకోవాల్సి వచ్చింది. అయితే, ఇటీవల ఒమన్‌కు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లు, సోహార్ అనే ఒక ఎల్ఎన్జీ క్యారియర్.. ఇరాన్ నియంత్రిత మార్గాన్ని తప్పించుకుని అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. ఉద్రిక్తతలు పెరిగాక ఈ జలసంధిని దాటిన తొలి ఎల్ఎన్జీ క్యారియర్ ఇదే కావడం గమనార్హం. ఫ్రాన్స్‌కు చెందిన సీజీఏం సంస్థకు సంబంధించిన ఒక కంటైనర్ నౌక కూడా ఈ మార్గం గుండా ప్రయాణించింది. ఆంక్షల తర్వాత ఒక పాశ్చాత్య దేశానికి చెందిన నౌక ప్రయాణించడం ఇదే మొదటిసారని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 25 శాతం నౌకల యజమానుల వివరాలు తెలియకపోవడం నిఘాను సంక్లిష్టంగా మారుస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# మరింత చమురు కావాలా... మేం సరఫరా చేస్తాం!

- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌కు రష్యా కీలక ఆఫర్
- చమురు, ఎల్ఎన్జీ సరఫరాను పెంచేందుకు సిద్ధమని వెల్లడి
- రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ భారత పర్యటనలో చర్చలు
- ఇటీవల తగ్గిన దిగుమతులు మళ్లీ పెరిగే అవకాశం
- భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇచ్చే పరిణామం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న వేళ, భారత్‌కు రష్యా కీలకమైన ప్రతిపాదన చేసింది. దేశీయ అవసరాల కోసం క్రూడ్ ఆయిల్, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్ జీ) సరఫరాను మరింత పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో మంటురోవ్ సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా భేటీ అయ్యారు. ఈ చర్చల్లో ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారం ప్రధాన అంశంగా నిలిచింది. "భారత మార్కెట్‌కు స్థిరంగా చమురు, ఎల్ఎన్జీ సరఫరాను పెంచే సత్తా తమ కంపెనీలకు ఉంది" అని మంటురోవ్ స్పష్టం చేసినట్లు రష్యా అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవడంతో, ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధి మీదుగా సరఫరాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవలి గణాంకాల ప్రకారం, జనవరి 2026లో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు 19.3 శాతానికి తగ్గాయి. అయితే, ఫిబ్రవరి చివరి నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత భారత్ మళ్లీ రష్యా నుంచి కొనుగోళ్లను పెంచుతోంది. ఇంధనంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఎరువులు, కనెక్టివిటీ వంటి ఇతర రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించడంపై ఈ సమావేశాల్లో చర్చించారు. గతేడాది భారత్‌కు ఎరువుల సరఫరా 40 శాతం పెంచామని, భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహకరిస్తామని మంటురోవ్ తెలిపారు. రష్యా తాజా ప్రతిపాదన భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇవ్వడంతో పాటు, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# అత్యంత అందంగా భూమి...
## అద్భుతమైన ఫొటో విడుదల చేసిన నాసా

- చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న ఆర్టెమిస్-2
- ఒరియన్ క్యాప్సూల్ నుంచి భూమి హై-రిజల్యూషన్ ఫోటో విడుదల
- నీలి, గోధుమ రంగులతో మెరుస్తున్న భూగోళం
- ఆకుపచ్చని అరోరా కూడా స్పష్టంగా కనిపిస్తోందన్న నాసా
- మనమంతా కలిసి వ్యోమగాముల ప్రయాణాన్ని చూస్తున్నామని వ్యాఖ్య



వాషింగ్టన్, ఏప్రిల్ 3 అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా, భూమికి చెందిన ఒక అద్భుతమైన చిత్రాన్ని విడుదల చేసింది. చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న ఆర్టెమిస్2 వ్యోమగాములు, తమ ఒరియన్ క్యాప్సూల్ కిటికీ నుంచి ఈ హైరిజల్యూషన్ ఫోటోను తీశారు. ప్రస్తుతం ఈ చిత్రం సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోలో భూగోళం మొత్తం నీలి, గోధుమ రంగులతో ప్రకాశవంతంగా కనిపిస్తోంది. వాతావరణంలో ఏర్పడిన ఆకుపచ్చని అరోరా కూడా ఈ చిత్రంలో స్పష్టంగా కనువిందు చేస్తోంది. ఈ చిత్రాన్ని పంచుకుంటూ నాసా ఒక స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇచ్చింది. "చంద్రుడి వైపు మా వ్యోమగాములు ప్రయాణిస్తుంటే, మనమంతా కలిసి వారిని చూస్తున్నాం. ఈ చిత్రంలో కనిపిస్తున్నది మనందరి ఇల్లు, మన భూమి" అని నాసా తన పోస్టులో పేర్కొంది. మానవులను తిరిగి చంద్రుడిపైకి పంపేందుకు నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో భాగంగా ఆర్టెమిస్2 మిషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# ఇంధన కొరతతో 4 గంటలకే ఆఫీస్ క్లోజ్.. బంగ్లాదేశ్ కీలక నిర్ణయాలు



ఢాకా : ఇంధన కొరత కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత కొనసాగుతున్నందున దుకాణాలు, షాపింగ్ మాల్స్, బ్యాంకులు, కార్యాలయాల పని సమయాన్ని కుదిస్తూ బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలో నిర్వహించిన మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది. అన్ని దుకాణాలు, షాపింగ్ మాల్స్ సాయంత్రం 6 గంటలకే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. కార్యాలయాల్లో పని గంటలను కూడా గంట తగ్గించింది. ఇక మీదట సాయంత్రం ఐదు గంటలకు బదులు 4 గంటలకు కార్యాలయాలు మూసివేయాలని ఆదేశించింది. బ్యాంకింగ్ లావాదేవీలు కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు బ్యాంకులు మూతబడనున్నాయి. అయితే హోటళ్లు, ఫార్మసీలు, అత్యవసర సేవలు, నిత్యావసర వస్తు మార్కెట్లకు మాత్రమే ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌కు భారత్ 5,000 టన్నుల డీజిల్‌ను సరఫరా చేసింది. రాబోయే నాలుగు నెలల్లో 50,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను సరఫరా చేయాలని భారత ప్రభుత్వాన్ని బంగ్లాదేశ్ అభ్యర్థించింది. ఆ దేశ విన్నపాన్ని పరిశీలిస్తున్నట్లు భారత్ తెలిపింది.

# చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా యూసీసీ అడ్డుకుంటుంది: అమిత్ షా

చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ద్వారా అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని గోల్‌పడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ, అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ రోడ్ మ్యాప్ సిద్ధం చేశారని అన్నారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారని కాంగ్రెస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అసోంలో తమకు మరో ఐదేళ్లు సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి పూర్తిగా చొరబాటుల నుంచి విముక్తి కలిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అసోంలో యూసీసీని అమలు చేస్తామని అమిత్ షా అన్నారు.

## సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోళ్లలో కొత్త ట్రెండ్...

**చిన్న నగరాల వినియోగదారులదే హవా**



**న్యూఢిల్లీ:** దేశంలో సెకండ్ హ్యాండ్ కార్ల (యూజ్డ్ కార్) మార్కెట్ స్వరూపం వేగంగా మారిపోతోంది. ఒకప్పుడు ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాల చుట్టూ తిరిగిన ఈ వ్యాపారం ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాల వైపు మళ్లింది. కార్స్24 విడుదల చేసిన 'గేర్స్ ఆఫ్ గ్రోత్ రిపోర్ట్ 2025' ప్రకారం, దేశంలోని మొత్తం సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాల్లో ద్వితీయ శ్రేణి నగరాల వాటా ఏకంగా 62 శాతానికి చేరగా, మెట్రో నగరాలు 38 శాతానికే పరిమితమయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, 2024లో 13.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్న ఢిల్లీ, 2025 నాటికి కేవలం 5.8 శాతానికి పడిపోయింది. హర్యానా వాటా కూడా 10.7 శాతం నుంచి 5.6 శాతానికి తగ్గింది. మరోవైపు, కర్ణాటక (10 శాతం నుంచి 16 శాతానికి), గుజరాత్ (8.7 శాతం నుంచి 13.1 శాతానికి) రికార్డు స్థాయిలో వృద్ధిని నమోదు చేశాయి. మహారాష్ట్ర 20.1 శాతం వాటాతో అతిపెద్ద మార్కెట్‌గా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోగా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వాటాలు దాదాపు రెట్టింపు అయ్యాయి.

### ప్రాధాన్యతల్లో తేడాలు

మెట్రో నగర వాసులు సెకండ్ హ్యాండ్ కారును మెరుగైన వాహనానికి అప్‌గ్రేడ్ అయ్యేందుకు ఒక అవకాశంగా చూస్తుంటే, ద్వితీయ శ్రేణి నగరాల్లోని చాలా మందికి ఇదే మొదటి కారు. అందుకే వారు తక్కువ నిర్వహణ ఖర్చులు, అధిక ఇంధన సామర్థ్యం, మన్నిక వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. టాటా నెక్సాన్ రెండు ప్రాంతాల్లోనూ ఆదరణ పొందుతుండగా, మెట్రోల్లో మారుతి బాలెనో, హోండా సిటీ వంటి ప్రీమియం మోడళ్లకు డిమాండ్ ఉంది. అదే సమయంలో, ద్వితీయ శ్రేణి నగరాల మార్కెట్లలో హ్యుండై గ్రాండ్ ఐ10, రెనాల్ట్ క్విడ్ వంటి బడ్జెట్ కార్లకు గిరాకీ ఎక్కువగా ఉంది.

ద్వితీయ శ్రేణి నగరాల్లో పెరుగుతున్న ఆదాయాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నాణ్యమైన కార్లు అందుబాటులోకి రావడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలు ఈ మార్పునకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఈ కొత్త ట్రెండ్ భారత ఆటోమొబైల్ మార్కెట్‌కు మరింత స్థిరత్వాన్ని అందిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కార్ సర్వీసింగ్ సెంటర్ల సంఖ్యను మరింత పెంచిన మారుతి సుజుకి




**న్యూఢిల్లీ:** భారతదేశపు అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థ మారుతీ సుజుకీ, తన ఆఫ్టర్-సేల్స్ సర్వీస్ నెట్‌వర్క్‌ను రికార్డు స్థాయిలో విస్తరించింది. 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 502 కొత్త సర్వీస్ టచ్‌పాయింట్లను ప్రారంభించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఒకే ఏడాదిలో ఇంత భారీగా నెట్‌వర్క్‌ను విస్తరించడం కంపెనీ చరిత్రలోనే ఇది తొలిసారి. దీంతో మారుతీ మొత్తం సర్వీస్ కేంద్రాల సంఖ్య 3,000 నగరాలు, పట్టణాల్లో 5,926కు చేరుకుంది.

ఈ విస్తరణలో భాగంగా మెట్రో నగరాల నుంచి మారుమూల ప్రాంతాల వరకు వినియోగదారులకు సేవలు అందించేలా అరెనా, నెక్సా వర్క్‌షాప్‌లు, మారుతీ సుజుకీ సేల్స్ అండ్ సర్వీస్ పాయింట్లు, సర్వీస్-ఆన్-వీల్స్ వంటి వివిధ ఫార్మాట్లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈఓ హిసాషి టేకుచి మాట్లాడుతూ.. "వినియోగదారులు వర్క్‌షాప్‌కు రావాలనుకున్నా, డోర్‌స్టెప్ సర్వీస్ కోరుకున్నా, లేదా రోడ్ ట్రిప్ సమయంలో సహాయం అవసరమైనా.. మారుతీ సర్వీస్ కేంద్రం వారికి అందుబాటులో ఉంటుంది" అని తెలిపారు. 2030--31 ఆర్థిక సంవత్సరం నాటికి తమ నెట్‌వర్క్‌ను సుమారు 8,000 టచ్‌పాయింట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

కంపెనీ తన మొదటి సర్వీస్ వర్క్‌షాప్‌ను 1983లో ప్రారంభించగా, 1,000 కేంద్రాల మార్కును చేరుకోవడానికి సుమారు 14 ఏళ్లు పట్టింది. కాగా, మార్చి నెలలో కంపెనీ రిటైల్ అమ్మకాల్లో 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది మార్చిలో 1,92,984 యూనిట్లు అమ్మగా, ఈ ఏడాది మార్చిలో 2,25,251 యూనిట్లను విక్రయించింది. గురువారం నాడు బీఎస్ఈలో మారుతీ సుజుకీ షేరు విలువ 1 శాతం పెరిగి రూ. 12,632 వద్ద ముగిసింది.

## రేంజ్ రోవర్ లగ్జరీ కార్లపై భారీ డిస్కౌంట్..

**కోటి రూపాయలకు పైగా తగ్గనున్న ధర!**




**న్యూఢిల్లీ:** భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ప్రభావంతో లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తమ కార్ల ధరలను గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయంతో కొన్ని టాప్-ఎండ్ రేంజ్ రోవర్ మోడళ్ల ధరలు ఏకంగా కోటి రూపాయలకు పైగా తగ్గే అవకాశం ఉంది.

గతేడాది జులైలో భారత్, యూకే మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రకారం.. యూకే నుంచి పూర్తిస్థాయిలో తయారై దిగుమతి అయ్యే కార్లపై (సీబీయూ) దిగుమతి సుంకం మొదటి ఏడాదిలో 110 శాతం నుంచి 30 శాతానికి తగ్గనుంది. దీనివల్ల బాలీవుడ్ ప్రముఖులు అలియా భట్, రణ్‌వీర్ సింగ్, సోనమ్ కపూర్ వంటి వారు ఎక్కువగా ఇష్టపడే రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ, ఎస్‌వీ ఎడిషన్ల వంటి హై-ఎండ్ వేరియంట్ల ధరలు భారీగా తగ్గనున్నాయి.

నివేదికల ప్రకారం ఈ కార్ల ధరలు 13 నుంచి 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఉదాహరణకు ప్రస్తుతం రూ. 2.75 కోట్లుగా ఉన్న రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్‌వీ ఎడిషన్ టూ ధర రూ. 2.35 కోట్లకు చేరవచ్చు. అదేవిధంగా రూ. 4.25 కోట్ల విలువైన రేంజ్ రోవర్ 4.4-లీటర్ పెట్రోల్ ఎస్‌వీ మోడల్ ధర రూ. 3.19 కోట్లకు దిగిరావచ్చని అంచనా.

అయితే, ఈ ధరల తగ్గింపు కేవలం యూకే నుంచి దిగుమతి చేసుకునే ఎస్‌వీ మోడళ్లకు మాత్రమే వర్తిస్తుంది. పూణెలోని ప్లాంట్‌లో విడిభాగాలను (సీకేడీ) తెచ్చి అసెంబుల్ చేసే రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్, వెలార్, డిస్కవరీ స్పోర్ట్ వంటి మోడళ్లపై ఈ ప్రభావం ఉండదు. అలాగే, స్లోవేకియాలో తయారయ్యే డిఫెండర్ మోడల్ ధరలో కూడా మార్పు ఉండదు. ప్రస్తుతం భారత లగ్జరీ కార్ల మార్కెట్‌లో 25 శాతం వాటాను కలిగి ఉన్న జేఎల్ఆర్.. ఈ ధరల తగ్గింపుతో మెర్సిడెస్, బీఎండబ్ల్యూ వంటి ప్రత్యర్థి సంస్థలపై పోటీలో మరింత పట్టు సాధించనుంది.

## సీఎస్కే మళ్లీ ఓడింది...

# ఈసారి సొంతగడ్డపై!




**చెన్నై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మరోసారి అదరగొట్టింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 210 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ కేవలం 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50; 29 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లు) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మిగిలిన బ్యాటర్లు కూడా రాణించడంతో పంజాబ్‌కు సునాయాస విజయం దక్కింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్‌కు చెన్నై బ్యాటర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా యువ ఆటగాడు అయూష్ మాత్రే (73; 43 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అతనికి తోడుగా శివమ్ దూబే (45నీ; 27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్), సర్ఫరాజ్ ఖాన్ (32; 12 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపులు మెరిపించడంతో చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశ్యాఖ్ రెండు వికెట్లు తీయగా, బార్ట్‌లెట్, జాన్సెన్, చాహల్ తలో వికెట్ పడగొట్టారు.

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కేవలం 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసి మెరుపు ఆరంభాన్నిచ్చాడు. అతని ధాటికి పంజాబ్ పవర్‌ప్లేలోనే 68 పరుగులు రాబట్టింది. అనంతరం ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (43), కూపర్ కనోలీ (36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన అర్ధశతకంతో జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో శశాంక్ సింగ్ (14నీ), మార్కస్ స్టోయినిస్ (9నీ) లాంఛనాన్ని పూర్తి చేయడంతో పంజాబ్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది.

చెన్నై బౌలర్లలో మ్యాట్ హెన్రీ, అన్షుల్ కంబోజ్ రెండేసి వికెట్లు తీసినా, ధారాళంగా పరుగులు సమర్పించుకోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు. సొంతగడ్డపై భారీ స్కోరు చేసినప్పటికీ బౌలర్ల వైఫల్యంతో చెన్నైకి నిరాశే ఎదురైంది. కాగా, చెన్నై జట్టుకు ఇది వరుసగా రెండో ఓటమి. గువాహటిలో జరిగిన తొలి మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడిపోయిన సీఎస్కే... ఇవాళ సొంతగడ్డపై జరిగిన మ్యాచ్ లోనూ పరాజయం చవిచూసింది.

## అభిషేక్ శర్మకు జరిమానా..

**మ్యాచ్ ఫీజులో 25 శాతం ఫైన్**




**కోల్‌కతా:** ఐపీఎల్‌లో కోల్‌కతాతో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు సూపర్ విక్టరీ కొట్టిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో 65 రన్స్ తేడాతో ఎస్ఆర్‌హెచ్ విజయం నమోదు చేసింది. అయితే హైదరాబాదీ బ్యాటర్ అభిషేక్ శర్మ(గూఎప్త్రఅంప్త్రవని రాష్ట్రుతీఝు)కు ఈ మ్యాచ్‌లో ఫైన్ పడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిన ఘటనలో అతనికి ఓ డీమెరిట్ పాయింట్ కూడా వచ్చింది. మ్యాచ్ ఫీజులో అతనికి 25 శాతం జరిమానా విధించారు. ఆర్టికల్ 2.3 ప్రకారం లెవల్ 1 నేరానికి పాల్పడినట్లు అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన జరిమానాను ఆమోదించాడు. ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1 ఉల్లంఘనలకు పాల్పడితే, మ్యాచ్ రిఫరీ నిర్ణయమే ఫైనల్ అవుతుంది.

ఈ మ్యాచ్‌లో అభిషేక్ కేవలం 21 బంతుల్లో 48 రన్స్ చేశాడు. భారీ స్ట్రోక్స్‌తో అలరించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ముజర్బానీ బౌలింగ్‌లో భారీ హుక్ షాట్‌కు ప్రయత్నించాడు అభిషేక్. అయితే అతను కొట్టిన బంతిని వరుణ్ చక్రవర్తి డీప్‌లో అందుకున్నాడు. ఆ క్యాచ్‌పై థార్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని ప్రకటించాడు. టీవీ అంపర్ నితిన్ మీనన్ ఇచ్చిన నిర్ణయంపై అభిషేక్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో.. టీవీ అంపైర్‌ను అభిషేక్ తప్పుపట్టాడు. ఈ ఘటనలో ఐపీఎల్ చర్యలు తీసుకున్నది. హైదరాబాదీ ప్లేయర్‌కు జరిమానా విధించింది.

## నేను ఐపీఎల్ ఆడడం

# వాళ్లకు నచ్చట్లేదు..

**అసూయతోనే 'స్ట్రయిక్ రేటు'పై విమర్శలు..!**



**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడడంతో కెప్టెన్ అంజిక్యా రహానేపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. రహానే దూకుడుగా ఆడలేకపోవడం కోల్‌కతా విజయావకాశాల్ని దెబ్బతీస్తుందని కామెంటేటర్లు, మాజీ ఆటగాళ్లు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో తన స్ట్రయిక్ రేటుపై వస్తున్న కామెంట్లపై రహానే కరుకుగా స్పందించాడు. కొందరికి తనంటే అసూయ అని, ఉద్దేశపూర్వకంగానే తనపై విమర్శలు చేస్తున్నారని కౌంటర్ ఇచ్చాడు కేకేఆర్ సారథి.

ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఇంకా బోణీ కొట్టలేదు. తొలి మ్యాచ్‌లో పంజాగ్ కింగ్స్ చేతిలో.. రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పంజాకు కోల్‌కతా కుదేలైంది. మూడుసార్లు ఛాంపియన్ అయిన కేకేఆర్ వరుస ఓటములకు కెప్టెన్ అజింక్యా రహానే స్ట్రయిక్ రేటు ఓ కారణమని విమర్శలు వస్తున్నాయి. దాంతో.. తనపై అనవసరంగా కొందరు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని వాపోతున్నాడు రహానే.

'నా స్ట్రయిక్‌రేటుపై కొందరు విమర్శలు చేస్తున్నారు. కానీ, ఇప్పటివరకూ నేను గొప్పగా ఆడుతున్నా. 2023 సీజన్ నుంచి స్ట్రయిక్ రేటు ఎంతో మెరుగైంది. నా గురించి చెత్త మాట్లాడేవాళ్లు నా ఆట చూడడం లేదు కావచ్చు లేదా ఉద్దేశపూర్వకంగా నన్ను లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చు. అలాంటి వాళ్లకు నేను ఆడడం నచ్చదు. నా ఆట చూడడం వాళ్లకు ఇష్టముండదు. నేను సాధించిన విజయాలు చూసి వాళ్లు అసూయ పడుతున్నారు. వాళ్ల మాటలకు నేను ఆందోళన చెందడం లేదు.

నేను దూకుడుగానే ఆడాలనుకుంటా. అయితే కొన్నిసార్లు బ్యాటర్లకు చెలరేగే అవకాశం రాదు. దూకుడుగా ఆడలేం. నన్ను విమర్శించేవాళ్లు నేను మరోలా ఆడాలని ఆశిస్తున్నారు. రహానే తన ఆటను ఇంతలా మెరుగుపరచుకోవడం వాళ్లకు నచ్చడం లేదు.

# నిజమైన ఆటగాడు..

**సంజు శాంసన్‌ను చూసి నేర్చుకోండి: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్, కేరళ ఆటగాడు సంజూ శాంసన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ కనబరిచిన అద్భుతమైన ఆటతీరును ఆయన కొనియాడారు. కేరళ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల అమోఘమని అన్నారు. జట్టుకు అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేసేవాడే నిజమైన ఆటగాడని ఆయన అభివర్ణించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తోంది. కేరళ ప్రజలు కూడా సంజూ శాంసన్ ప్రదర్శన నుంచి నేర్చుకోవాలి. ప్రపంచకప్‌లో శాంసన్ ఆటతీరును మనం చూశాం. టోర్నమెంట్‌లో కీలకమైన నాకౌట్ దశ వచ్చినప్పుడు, అతని ప్రదర్శన అకస్మాత్తుగా శిఖర స్థాయికి చేరింది. టోర్నీ ఆరంభం నుంచి ముగింపు వరకు అతని ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతూనే ఉన్నాయి. జట్టుకు అతని అవసరం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఇదే నిజమైన ఆటగాడికి ఉండాల్సిన లక్షణం" అని తెలిపారు.

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో 80.25 సగటు, 199.37 స్ట్రైక్ రేట్‌తో 321 పరుగులు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్" అవార్డును గెలుచుకున్నాడు. ఇందులో 27 ఫోర్లు, 24 సిక్సులు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ (2014లో 319 పరుగులు) రికార్డును శాంసన్ అధిగమించాడు.

టోర్నీ ఆరంభంలో రెండు మ్యాచ్‌లలో పెద్దగా రాణించకపోయినా, సూపర్-8 దశ నుంచి శాంసన్ చెలరేగిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అజేయంగా 97 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై మరో 89 పరుగులతో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.



# వేసవిలో నవ్వుల వినోదం నిహారిక రాకాస చిత్రం

టాకీస్: కమిటీ కుర్రోళ్లు'తో నిర్మాతగా తన అభిరుచిని చాటారు నిహారిక కొణిదెల. ఇప్పుడు సంగీత్ శోభన్ కథానాయకుడిగా బలమైన ప్రచారంతో 'రాకాస' సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. వీరబాబు అలియాస్ వీరు (సంగీత్ శోభన్) తాను ప్రేమించిన అమ్మాయి కోసం అమెరికా నుంచి ఎంతో హుషారుగా ఊరికి తిరిగొస్తాడు. అయితే అప్పటివరకూ తనని ఫోన్ కాల్స్‌లో కవ్విస్తూ, ముద్దు ముద్దుగా మాట్లాడిన ఆ అమ్మాయి మరొకరితో పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమైందని తెలుసుకుంటాడు. ఎలాగైనా ఆ పెళ్లిని ఆపాలని తన స్నేహితుడు బాలు (గెటప్ శ్రీను)తో కలిసి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. అందులో భాగంగా తనతోపాటు చిన్నప్పుడు కలిసి చదువుకున్న సుబ్బలక్ష్మి (నయన్ సారిక)నీ కలుస్తారు. చివరికి వీరు, సుబ్బలక్ష్మి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఊరి సమీపంలోని రాక్షస కోట నరబలి కోరడం అక్కడ ఆనవాయితీ. మూడు సంకేతాల తర్వాత ఊరంతా కలిసి ఒకరి పేరుని ఖరారు చేస్తుంటారు. ఆ వ్యక్తిని కోటలోకి పంపుతారు. అలా చేస్తేనే ఊరికి మంచి జరుగుతుందని, లేదంటే బ్రహ్మ రాక్షసుడి కారణంగా ఊరంతా నాశనమవుతుందనేది స్థానికుల నమ్మకం. అయితే ఊహించని రీతిలో వీరు కోటలోకి వెళ్లాల్సి వస్తుంది. మరి కోటలోకి వెళ్లిన వీరు తిరిగొచ్చాడా? అతన్ని కాపాడేందుకు సుబ్బలక్ష్మి, బాలు ఏం చేశారు? ఇంతకీ ఆ కోటలో ఉన్న రాక్షసుడి చరిత్ర ఏమిటనే విషయాల్ని తెరపై ప్రదర్శించారు. ఒక కోట...అందులో భీకరమైన బ్రహ్మ రాక్షసి అనగానే ఎవరికైనా హారర్ నేపథ్యమే గుర్తొస్తుంది. ప్రచార చిత్రాలు కూడా అదే అభిప్రాయాన్నే కలిగిస్తాయి. కానీ, ఈ సినిమా భయపెట్టడం కంటే కూడా, ఫాంటసీ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ కథలో లీనం చేయడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. హారర్ కామెడీతో కాకుండా, ఓ ఫాంటసీ కామెడీ కథగా దీనిని తీర్చిదిద్దారు. థియేట్రికల్ అనుభూతిని పంచేలా సాగే కోట నేపథ్యంలోని సన్నివేశాలు, ద్వితీయార్ధంలో కామెడీ సినిమాకి బలం. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో చెప్పినట్టుగా సన్నివేశాలన్నీ చందమామ కథలా చిన్నారులకు నచ్చేలా ఉంటాయి. ఊరి కథ, మూడు హెచ్చరికలు అంటూ సినిమా ఆసక్తికరంగానే మొదలవుతుంది. ద్వితీయార్ధంలో హీరో కోటలోకి వెళ్లినప్పట్నుంచే సినిమా అసలు సిసలు ఆసక్తిని రేకెత్తిస్తుంది. కోటని చూపించిన విధానం, తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తించిన తీరు, రాక్షసుడి చరిత్ర, ప్రధాన పాత్రలు భయపడుతూనే నవ్వించడం సినిమాకి కలిసొచ్చింది. ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా పతాక సన్నివేశాలు మలిచారు. కొన్ని మలుపులు మెప్పిస్తాయి. ద్వితీయార్ధం స్థాయిలో ప్రథమార్ధం కూడా ప్రభావం చూపించి ఉంటే ఈ సినిమా ఫలితం వేరుగా ఉండేది. మొత్తంగా అక్కడక్కడా నవ్విస్తూ, భయపెడుతూ, సెలవుల్లో పిల్లలు ఆస్వాదించేందుకు తగ్గ సరికొత్త కాల్పనిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన చిత్రమిది. వీరు పాత్రలో సంతోష్ శోభన్ ఒదిగిపోయాడు. గెటప్ శ్రీను, వెన్నెల కిశోర్, నయన్ సారికతో కలిసి ఆయన చేసిన అల్లరి అక్కడక్కడా నవ్వించింది. కామెడీలో బలం లేకపోయినా సరే, తన నటనతో ఆ సన్నివేశాలపై ప్రభావం చూపించే ప్రయత్నం చేశారు. వెన్నెల కిశోర్ పాత్ర పరిచయం తర్వాత సినిమాలో కామెడీ మోతాదు పెరిగింది. బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి పాత్రలు సినిమాలో ప్రధానంగా కనిపిస్తాయి. ఆశిష్ విద్యార్థి, రోహన్ రాయ్ తదితరులు పాత్రల పరిధి మేరకు నటించారు.


## కొత్త మూవీని ప్రకటించిన సాయిదుర్గా తేజ్




టాకీస్: వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని అన్నారు.

## ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

టాకీస్: పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.





MOVIE TIME

# 'పాకెట్ నవల్' మూవీతో ఎంతో నేర్చుకున్నా

నటి మాళవిక మోహనన్

టాకీస్: ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.

టాకీస్: టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

## ఆది కొత్త సినిమా సైరాబాను క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం






Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.